నవతెలంగాణ
1
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | ఏప్రిల్ 22, 2024 | www.navatelangana.com

వరాల జల్లు కురిసేనా..?

- నేడు తొలిసారి జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత తొలిసారి సీఎం రేవంత్‌రెడ్డి నేడు జిల్లాకు రానున్నారు. దీంతో జిల్లాకు ఏమైనా వరాల జల్లు కురిపించేనా అని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు. నేడు కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అనంతరం పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న తాజా అంశాలపై ఏమైనా హామీలు ఇచ్చేనా అని జిల్లా చర్చలు నెలకొన్నాయి. బోధన్ షుగర్ ఫ్యాక్టరీ, గల్ఫ్ కార్మికుల భరోసా ఇటీవల ప్రకటనలపై మాట్లాడే అవకాశం ఉంది. మంచిప్ప రిజర్వాయర్, పసుపు బోర్డు, బోధన్ నుంచి జహీరాబాద్‌కు రైలు మార్గం, నిజామాబాద్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తూ, అండర్ గ్రౌండ్ పూర్తి సమస్యను పరిష్కారానికి ఏమైనా హామీలు ఇచ్చేనా అని ఎదరుచూస్తున్నారు. నిజామాబాద్ జిల్లాకు ఇంజనీరింగ్ కళాశాల, మహిళల కోసం ప్రత్యేక కళాశాలను ఏర్పాటు ఇతరాత్ర వరాలు ఏమైనా కురిపించేనా అని ఎదురుచూస్తున్నారు.

కరెంటు షాక్‌తో వ్యక్తి మృతి

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని ధూప్యా తండాకు చెందిన మాలవత్ నవీన్ (29) కరెంట్ షాక్ తో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆదివారం మృతుడు నవీన్ సొంత ట్రాక్టర్ సాయంతో మట్టిని తరలించాడు. ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడటంతో ట్రాలీని తీయడానికి ఇనుప స్టీల్‌తో ట్రాలీని తీసే క్రమంలో కరెంట్ తీగలకు ఇనుప రాడ్ తగిలి కరెంట్ షాక్ తగలడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు చెప్పారు. మృతిడికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.


మృతి చెందిన నవీన్

విద్యాశాఖలో అవినీతి


ప్లే గ్రౌండ్ లేకుండా అపార్ట్‌మెంట్‌లో కొనసాగుతున్న ఓ స్కూల్

- నిబంధనలు పాటించకున్నా.. పలు ప్రయివేటు స్కూళ్లకు అనుమతులు
- అధికారులు అమ్యామ్యా అందుకుంటున్నట్టు ఆరోపణలు
- ఎమ్మెల్యే కేవీఆర్ స్పందించేనా..?

నవతెలంగాణ-కామారెడ్డి

స్కూళ్లు.. విద్యార్థులను బావిభారత పౌరులుగా తీర్చేదిద్దేవి. సేవా దృక్పథంతో స్కూళ్ల ఏర్పాటు చేసి విద్యార్థులకు చదువు చెప్పాల్సి ఉండగా.. పలువురు మాత్రం ధనార్జనే లక్ష్యంగా పలు ప్రయివేటు స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నారు. కనీస సౌకర్యాలు లేకున్నా.. వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారు. నిబంధనలు పాటించకున్నా.. వారిని అడిగేవారు లేకుండా పోతున్నారు. అమ్యామ్యాలు అందుతుండటంతో విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. తన హయాంలో అవినీతిని అనుమతించబోమని చెప్పిన కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి స్పందించి చర్యలకు ఉపక్రమిస్తారా అని స్థానికులు ఎదురుచూస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరం ఆరంభం కంటే ముందే చర్యలు దిగితే.. స్కూళ్ల ప్రారంభమయ్యేలోగా సౌకర్యాలు కల్పించే అవకాశం ఉందని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

కామారెడ్డి జిల్లా కేంద్రంలో పలు ప్రయివేటు విద్యాసంస్థల తీరే వేరుగా ఉంది. కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యా హక్కు చట్టాన్ని పాటించకుండా తమ ఇష్టం వచ్చినట్లుగా పాఠశాల నిర్వహిస్తున్నా సంబంధిత విద్యాశాఖాధికారులు వారికి వంత పాడుతూ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

చుట్టాలుగా మారిన చట్టాలు

చట్టాలు తమకు చుట్టాలుగా మారినట్టు ప్రయివేటు విద్యాసంస్థల యాజమానులు ప్రవర్తిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహిస్తే వాటికి కావలసిన నియమ నిబంధనలు చట్టాల రూపంలో ఉన్న వాటిని అమలు చేసే అధికారులు మాత్రం విద్యాసంస్థల యాజమానాలకు చుట్టాలుగా మారి విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారు. విద్యాశాఖ అధికారులు తనిఖీలకు వెళ్లిన సమయంలో వారికి రాచ మర్యాదలు చేయడం, వారికి కావలసిన ఏర్పాట్లను చేయడంతో సంతృప్తి చెందిన విద్యాశాఖ అధికారులకు విద్యాహక్కు చట్టం గుర్తుకురావడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఆట స్థలాలు లేని పాఠశాలలు ఎన్నో

కామారెడ్డి జిల్లా కేంద్రంలో 40 వరకు ప్రైవేటు పాఠశాలలు ఉండగా ఇందులో సుమారు నాలుగు, ఐదు పాఠశాలలకు తప్ప ఏ పాఠశాలల్లో ఆట స్థలాలు లేవు. కేవలం ఆగస్టు 15, జనవరి 26 కు మాత్రం ఈ ప్రైవేటు పాఠశాల యజమానులకు విద్యార్థులు ఆటలు ఆడుతారని జ్ఞాపకం వచ్చి ఆ రోజున మాత్రమే ఇక్కడ దూరంగా తీసుకెళ్లి రెండు లేదా మూడు రోజులు ఆటలు ఆడిపించి మామ అనిపించడం తప్ప ప్రత్యేకంగా విద్యార్థులకు క్రీడాస్థలాలు ఏర్పాటు చేసి ఆటలు ఆడిపించడం లేదు. ప్రతిరోజు జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారి ఏదో ఒక పాఠశాలకు తనిఖీకి వెళుతూనే ఉంటారు. లేదా జిల్లా పాలన అధికారి ఏర్పాటు చేసే సమావేశాల్లో పాల్గొంటారు. ఎక్కడ కూడా పాఠశాలలు ఎలా కొనసాగుతున్నాయి విద్యార్థులకు సౌకర్యాలు ఎలా ఉన్నాయని పాలన అధికారి అడగడం కానీ విద్యాశాఖ అధికారులు చెప్పడం కానీ ఇప్పటివరకు జరగలేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

కాకతీయ స్కూల్‌పై చర్యలు శూన్యం

కామారెడ్డి జిల్లా కేంద్రం నడిబొడ్డున గల కాకతీయ పాఠశాల అపార్ట్‌మెంట్‌లో కొనసాగుతున్నా విద్యాశాఖ అధికారులు తనిఖీకి వెళ్లిన సమయంలో వారికి మాత్రం అపార్ట్మెంట్ కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. విద్యాశాఖ అధికారులు తనిఖీలకు వెళ్లడం లేదని మామూళ్లకు వెళుతున్నారని జిల్లా కేంద్రంలో జోరుగా ప్రచారం జరుగుతుంది.

వారికి అనుకూలమైనవే నిబంధనలు

ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు యజమానులు వారికి నచ్చినవే నిబంధనలు, విద్య హక్కు చట్టంలోని నిబంధనలు మాత్రం ఏమాత్రం పాటించడం లేదు. దీంతో వారికి నచ్చిన చోట అపార్ట్‌మెంట్‌లలో సైతం పాఠశాలను ఏర్పాటు చేస్తూ తిరిగి వారు ఎక్కడ అనుకుంటే అక్కడకి ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలలను తరలిస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవరిస్తున్నారు. విద్యార్థి సంఘాల నాయకులు వచ్చి పర్మిషన్ లేదని అడిగి విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తేనే తప్ప అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

ఎమ్మెల్యే స్పందించేనా..?

దేశ భవిష్యత్తును తయారు చేసే విద్యావంతులను తయారు చేసే పరిశ్రమలైన పాఠశాలలపై ఏ ఒక్క రాజకీయ పార్టీ రాజకీయ నాయకులు దృష్టి పెట్టడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కామారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన కేవీఆర్ ఇటీవల ప్రెస్‌మీట్ పెట్టి తన హయాంలో అవినీతికి చోటు ఉండదని ప్రకటించారు. మరి విద్యావ్యవస్థపై దృష్టిసారించి నిబంధనలు పాటించని ప్రయివేటు పాఠశాలలపై అధికారులతో మీటింగ్ నిర్వహించి ఆరా తీస్తారా లేకుంటే యథా రాజ తథా ప్రజా అన్న చందంగా వ్యవహరిస్తారా అని పట్టణ వాసులు చర్చించుకుంటున్నారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా కనీస మౌలిక సదుపాయాలు లేకుండా నడుస్తున్నాయి. కానీ ఏ ఒక ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం కానీ తనిఖీలు నిర్వహించడం కేసులు నమోదు చేయడం కాని చేసింది లేదు. విద్యార్థుల నుండి వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ విద్యా సంస్థల కి సపోర్ట్ చేస్తూ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారు. కనీస మౌలిక సదుపాయాలు మరుగుదొడ్లు, ఆట స్థలలు కూడా లేవు వీటిపై విద్యాశాఖ పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయి.

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్ కుమార్



తనిఖీలకు కాకుండా మామూళ్లకు వెళ్తున్నారు

విద్య శాఖ అధికారులు నామ మాత్రం తనిఖీలు చేస్తూ వాళ్ళు ఇచ్చే మామూళు తీసుకుని ఇష్టానుసారంగా అనుమతులు ఇస్తున్నారు. ఇలాంటివి మానుకోవాలి, ప్రవేటు ,కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ నాణ్యమైన విద్యను అందించలేకపోతున్నారు. పిల్లలకు ఆడుకోవడానికి ఆట స్థలం, పిల్లలకు అనుగుణంగా ఉండాలి. కానీ మెజార్టీ పాఠశాలలో ఆటస్థలం లేకపోవడం సిగ్గుచేటు. విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి. అనుమతి లేని పాఠశాలను ఇప్పటినుండి మూసివేసి యజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసే దిశగా కొనసాగాలి.

భారతీయ విద్యార్థి మోర్చ (బివిఎం) రాష్ట్ర కార్యదర్శి జీవీఎం, విఠల్



ముందే మేల్కొంటే మేలు

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏఏ పాఠశాలలైతే విద్య హక్కు చట్టానికి వ్యతిరేకంగా కొనసాగుతున్నాయో వాటికి ఇప్పటినుండే నోటీసులు ఇస్తూ సరిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అలా కాకుండా పాఠశాలలు ప్రారంభమై, విద్యార్థులు చేరి పాఠ్యాంశాలు బోధించే సమయంలో వెళ్లి పాఠశాల యజమానులను బెదిరించి మామూళ్లకు ఆశపడకుండా ఇప్పటినుండే విద్యాశాఖ అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. పాఠశాలలో ప్రారంభమైన తర్వాత విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఎవరు కూడా పాఠశాలలను మూసివేయాలని ఒత్తిడి చేయొద్దనే ఉద్దేశంతోనే విద్యాశాఖ అధికారులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు.

ఆట, పాటలతో విద్యాబోధన

- విద్యార్థులను ఆకట్టుకుంటున్న టీచర్ బోధన
- మారుమూల గ్రామమైన అంగన్వాడీలో ఉత్తమ సేవలు

నవతెలంగాణ-బోధన్


చిన్నారులకు ఆటతో విద్యానేర్పిస్తున్న టీచర్ సరిత

ఓ అంగన్వాడీ టీచర్ విద్యార్థులకు ఆకట్టుకునేలా ఆట, పాటలతో విద్యాబోధన చేస్తూ వారికి ఇష్టమైన టీచర్‌గా పేరు తెచ్చుకున్నారు. నేటి కాలంలో ప్రభుత్వ కార్యక్రమాలు అంటే కొంతమంది నిర్లక్షంగా వ్యవహరిస్తూ సరిగా పట్టించుకోరు. అది మారుమూల గ్రామమైతే అస్సలు పట్టించుకోరు. బోధన్ మండలానికి మారుమూల గ్రామమైన హంగర్గా గ్రామంలో గల అంగన్వాడీ టీచర్ సరిత గత 17 సంవత్సరాల నుంచి అంగన్వాడీ టీచర్‌గా పని చేస్తున్నారు. ఈ అంగన్వాడీ కేంద్రంలో 15 మంది పిల్లలు చదువుకుంటున్నారు. అయితే చిన్నారులకు ఆమె వినూత్న రీతిలో అక్షరాలు, నీతి కథలు బోధించడంతో పిల్లలు క్రమం తప్పకుండా ఆమెను అనుసరిస్తున్నారు. ప్రతిరోజు పిల్లలు అంగన్వాడీ కేంద్రానికి హాజరవుతున్నారు.

విద్యార్థులను ఆకట్టుకుంటున్న టీచర్..

అంగన్వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు ఆమె ప్రేమగా లాలిస్తూ వారిని బుజ్జగిస్తు అంగన్వాడీ కేంద్రానికి అలవాటు అయ్యేలా చేస్తున్నారు. అలాగే తెలుగు, ఇంగ్లీష్ అక్షరాలు వారికి అర్థమయ్యేలా వారి మాటలలో బోధిస్తున్నారు. ఇంగ్లీష్ పదాలలో అక్షరాలను గుర్తించేలా ప్రత్యేకంగా చార్ట్ తయారుచేసి దానిని విద్యార్థులు గుర్తించేలా తర్ఫీదునిస్తున్నారు. అంతేకాకుండా వారిలో క్రమశిక్షణ పెంపొందించేలా నీతి కథలు చెబుతూ బోధిస్తున్నారు. పిల్లలు నీతి కథలు ఆకర్షతులై సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అలాగే గర్భిణీలకు ప్రతి శుక్రవారం, శనివారం పాలు, పెరుగు, కూరగాయల భోజనం అందిస్తున్నారు. చిన్నారులకు ప్రతి బుధవారం గుడ్లు, ఆకుకూరల వంటలతో పౌష్టికాహారం అందిస్తున్నారు. అలాగే విద్యార్థుల శారీరక అభివృద్ధిపై వారి ఎదుగుదలలో ఉండే మార్పులను, వారు నేర్చుకున్న అంశాలపై ఆమె ఎప్పటికప్పుడు సూపర్‌వైజర్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆమె ప్రజలకు చేరువ చేయడంలో ఎంతో కృషి చేస్తున్నారు. దాంతో అంగన్వాడీ కేంద్రం అందిస్తున్న సేవలను గ్రామస్థులు అభినందిస్తున్నారు.

జెండా మోసినోని కంటే

పార్టీలు మారినోడికే విలువనా..?

- ఆయా పార్టీల్లో కుమిలిపోతున్న నాయకులు
- సోషల్‌మీడియాలో తమ ఆగ్రహం వెళ్లగక్కుతున్న పలువురు

నవతెలంగాణ-మద్నూర్



నేటి రాజకీయాల్లో జెండా మోసినోని కంటే పార్టీలు మారినోడికే విలువిస్తున్నట్లు పలువురు నాయకులు వాపోతున్నారు. తమ ఆవేదనను సోషల్‌మీడియాలో వెళ్లగక్కుతున్నారు. దీంతో ఆ పోస్టులు వాట్సప్, ఫేస్‌బుక్ తదితర సోషల్‌మీడియా యాప్‌లలో వైరల్‌గా మారుతున్నాయి.

అధికారమెక్కడుంటే స్వార్థం కోసం పార్టీలు మారినోడికే అధికార పార్టీ నాయకులు అధిక విలువ ఇస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ కోసం ఏండ్ల తరబడి జెండాలు మోస్తూ పార్టీ నాయకులను గెలిపించుకుంటే అధికారంలోకి రాగానే జెండా మోసినోనికి వదిలేసి పార్టీ మారినోడికి అధిక ప్రాధాన్యతిస్తున్నారని నాయకులలో కార్యకర్తల్లో ఆవేదన వ్యక్తమవుతుంది. పార్టీ జెండా మోసి ఎన్నికల్లో నిలబడదా మంటే పార్టీ మారినోడికే అధిక ప్రాధాన్య ఇస్తూ అలాంటి వారికే టికెట్లు ఇవ్వడం రాజకీయ పార్టీల లో ఆనవాయితీగా కొనసాగుతూ వసున్నాయి. అధికారం లేనప్పుడు ఏండ్ల తరబడి పార్టీకి కట్టుబడి ఉన్నవారికి పార్టీలో విలువ లేకుండా పోతుందని కొత్తవారిని పార్టీలో చేర్చుకుంటూ అలాంటి వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. పార్టీ గెలుపు కోసం రాత్రింబవళ్లు కష్టపడితే అలాంటి జెండా మోసిన కార్యకర్తకు నాయకులకు విలువలు లేకుండా పోతున్నాయని పలువురు తమ ఆవేదనను వ్యక్తపరుస్తున్నారు. కార్యకర్తల ఆవేదన రాజకీయ నేతలు ఆలోచించవలసిన అవసరం ఎంతైనా ఉందని కామెంట్‌ల రూపంలో పలువురు సూచిస్తున్నారు.

రసవత్తరంగా

కుస్తీపోటీలు

- మహారాష్ట్ర మల్లయోధులపై స్థానిక మల్లయోధులదే హవా


గెలుపొందిన మల్లయోధునికి కడియం అందజేత

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని చిన్న కొడప్‌గల్ గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా శనివారం నిర్వహించిన కుస్తీ పోటీలలో నియోజకవర్గ మల్లయోధులతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల మల్లయోధులు పాల్గొనడంతో కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ సందర్భంగా ఉదయం 8గంటల నుంచి 7గంటల వరకు హెూరా హెూరీగా కుస్తీ పోటీలు నిర్వహించారు. కుస్తీ పోటీలలో మల్లయోధులు నువ్వా నేనా అన్న చందంగా కొనసాగాయి. ఈ పోటీలలో మహారాష్ట్రలోని నాసిక్, లాతూర్, నర్సినయగావ్, మల్లయోధులు, సంగారెడ్డిలోని సిర్గాపూర్, కల్హేర్, నియోజకవర్గంలోని జుక్కల్, మద్నూర్, బిచ్కుంద, డోంగ్లి, పెద కొడపగల్ మండలాలమల్లయోధులు పాల్గొన్నారు.

ఫైనల్ కుస్తీకి గాను 5తులాల వెండి కడియం కుస్తీ పోటీల నిర్వాహకులు ప్రకటించారు. మహారాష్ట్రలోని నర్సినయాగవ్‌కు చెందిన భగవాన్ కర్డేకర్, కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజవర్గంలోని పిట్లం మండలం గోడమేగావ్ గ్రామనికి చెందిన దత్తు మల్లయోధులు తలపడగా దత్తు విజయం సాధించడంతో ఆయనకు 5తులాల వెండి కడియంను ఎంపీటీసీ సుగిరెడ్డి వెంకట్రాంరెడ్డి అందజేశారు.

ఇటీవల మండల కేంద్రంలోని పిట్లం గ్రామంలో నిర్వహించిన కుస్తీ పోటీలలో ఫైనల్ కుస్తీ పోటీకు గాను 6తులాల వెండి కడియంను ప్రకటించడంతో మహారాష్ట్ర నాసిక్‌కు చెందిన యోగేశ్వర్ పాటిల్ కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని అంతాపూర్ గ్రామానికి చెందిన ఎరుకల గంగారాం వెండి కడియంను దక్కించుకున్నాడు. నియోజకవర్గ మల్లయోధులదేపై చేయిగా నిలిచింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చింతల సాయిరెడ్డి, నాగిరెడ్డి, గంగారెడ్డి, కుమ్మరి పోశయ్య, నార్మలి అంజయ్య, సాయినాథ్, అదిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామిక లౌకిక

రాజ్యాంగ విలువలను రక్షించాలి

- తెలంగాణ రచయితల వేదిక

కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్

నవతెలంగాణ-కామారెడ్డి


మాట్లాడుతున్న తెరవె జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్

ప్రజాస్వామిక లౌకిక రాజ్యాంగ విలువలను రక్షించే క్రమంలో కవులు, రచయితలు తమ రచనలను అందించాలని తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ అన్నారు. హైదరాబాదులోని బాగ్ లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజాస్వామిక లౌకిక రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రవ్యాప్త కవి, గాయక సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించి కవిత గానం చేశారు. దేశంలో ఎటు చూసినా వేదనలు, రోదనలు నిండుకున్నాయని విద్వేషాలు పెరుగుతున్న నేటి సమాజంలో కవుల బాధ్యత మరింత పెరిగిందని, సమైక్యతను పెంపొందించే రచనలు రావాలని ఆయన కవులు, రచయితలను కోరారు. ఈ సందర్భంగా కవి గఫూర్ శిక్షక్ రాష్ట్రవ్యాప్త కవి సమ్మేళనంలో తన కవితను వినిపించారు. సమూహ నిర్వాహకులు స్కైలాబ్‌బాబు, యాకూబ్ తదితరులు పాల్గొన్న ఈ సమావేశం 12 సెషన్లుగా కొనసాగిందనీ గఫూర్ శిక్ష తెలిపారు.

ప్రయివేటు కంపెనీల రాకతో

పొగాకు రైతుల్లో ఆనందం

- గణనీయంగా పెరిగిన పొగాకు ధర

నవతెలంగాణ-రెంజల్



గత కొన్ని సంవత్సరాలుగా కందకుర్తి, బోర్గం, పేపర్ మిల్లు గ్రామాలలో రైతులు పొగాకు పంటను పండిస్తూ, వజీర్ సుల్తాన్ టొబాకో కంపెనీ వారికి విక్రయిస్తూ ఉండేవారు. ఇటీవల ప్రైవేట్ కంపెనీల వారు సైతం పొగాకు కొనుగోలు చేయడానికి రావడంతో పొగాకు ధర క్వింటాలుకు సుమారుగా రూ.3000లు అదనంగా కొనుగోలు చేస్తూ ఉండడంతో రైతులకు తాము పండించిన పంటకు గిట్టుబాటు వచ్చిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన వజీర్ సుల్తానా టొబాకో కంపెనీతోపాటు, పిటిపి, కెఆర్‌కె, అలయన్స్ కంపెనీలు ముందుకు వాచ్చాయి. రెంజల్ మండలం బోర్గాం గ్రామానికి చెందిన ఖసీముద్దీన్ అలయన్స్ కంపెనీవారితో రైతుల పొగాకును కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చారు. కందకుర్తి, బోర్గం గ్రామాల నుంచి సుమారు 15 లారీల పొగాకును గుంటూరు బోర్డు రేటు ప్రకారం రైతుల నుంచి అలయన్స్ కంపెనీవారితో సంప్రదించి పొగాకు కొనుగోలు చేయించారు. గ్రేడ్ ప్రకారం రైతులకు క్వింటా లకు రూ.13,800 చొప్పున వారికి ఇప్పించడం జరిగిందని ఆయన తెలిపారు. పొగా కు కంపెనీలు పొగాకు కొనుగోలు చేయడానికి ముందుకు రావడంతో రైతులకు లాభం కలుగుతుందని వారు పేర్కొన్నారు. గత సంవత్సరం నుంచి పొగాకు పంటపై రైతుల పెట్టుబడులు పెరుగుతున్నప్పటికీ, పోగాకు యాజమాన్యం కేవలం ప్రతి ఏటా రూ.500 కంటే ఎక్కువగా ఇచ్చేవారు కాదని, ఈ సంవత్సరం ఒకేసారి రూ.3000 పెరగడంతో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా వారు పండించిన పడ్డకు గిట్టబాటు ధర లభించిందని రైతులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. కొనుగోళ్లలో పోటీ తత్వం పెరిగినప్పుడే రైతులకు లాభాలు చేకూరుతుందని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
నిజామాబాద్
సోమవారం | ఏప్రిల్ 22, 2024 | www.navatelangana.com

మహతి ఆశ్రమ గోశాలలో అగ్ని ప్రమాదం

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని మహతి ఆశ్రమ గోశాలలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గోశాలకు చెందిన పశుగ్రాసం కాలి బూడిదైంది. అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. గోవులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ అగ్ని ప్రమాదంతో పశుగ్రాసం, స్వల్ప ఆస్తి నష్టం జరిగిందని ఆశ్రమ వ్యవస్థాపకుడు నరేష్ తెలిపారు.


మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

రేపటి శోభాయాత్రకు ప్రజలు సహకరించాలి : సీపీ కల్మేశ్వర్

నవతెలంగాణ-నిజామాబాద్

ఈ నెల 23న ఉదయం నుంచి రాత్రి వరకు హనుమాన్ జయంతి శోభయాత్ర చేపట్టనున్న నేపథ్యంలో ఇందుకు ప్రజలు సహకరించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. శోభాయాత్రకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి పాల్గొనే అవకాశం ఉన్నందున ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా లలితమహల్ రైల్వే గేట్, గంజ్ గేట్ నెంబర్-2, గోదాం రోడ్, దేవి రోడ్, మమతా సర్కిల్, గాంధీచౌక్, నెహ్రూపార్క్, పెద్ద బజార్, లక్ష్మి మెడికల్, ఆర్ఆర్ చౌరస్తా వరకు గల దుకాణ యజమానులు, నివాసం ఉండే వారు 22 రాత్రి 8 గంటల నుంచి 24 ఉదయం 6 గంటల వరకు తమరి వాహనాలను శోభ యాత్ర వెళ్లే మార్గంలో రోడ్డుపైన పార్కు చేయవద్దని సూచించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలిగించవద్దని తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

మాకు మద్దతు ఇవ్వండి

- వాకర్స్‌ను కలిసిన ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే


వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-నిజామాబాద్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, స్థానిక మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల కోరారు. నిజామాబాద్ ఐటిఐ గ్రౌండ్‌లో ఆదివారం మార్నింగ్ వాకర్స్‌ను కలిశారు. మార్నింగ్ వాకింగ్ వచ్చిన వారందరినీ, ఆప్యాయంగా పలకరిస్తూ, వారి మంచి చెడులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో కాసేపు క్రీడల్లో పాల్గొని అనంతరం స్థానిక టిఫిన్ సెంటర్‌లో అల్పాహారం తీసుకున్నారు. పక్కనే గల టీ స్టాల్‌లో వచ్చిన ప్రజలతో కారుగుర్తుకు ఓటు వేసి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ నీతు కిరణ్, సిర్ప రాజు, సుజిత్ సింగ్, సదానంద్, గాండ్ల లింగం, ప్రవీణ్, మహేందర్, నీలగిరి రాజు, అనిల్, వాకర్స్ అసోసియేషన్ పృథ్వీరాజ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లిన స్వాములు

నవతెలంగాణ-ముప్కాల్

హనుమాన్ మాల ధరించిన హనుమాన్ భక్తులు దాదాపు 30 మంది ఆదివారం ఉదయం కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లారు. మండలంలోని నల్లూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయ సన్నిధి నుంచి హనుమాన్ స్వాములు కొండగట్టు ఆంజనేయ స్వామి వారిని దర్శించుకోవడానికి పాదయాత్రగా వెళ్లినట్టు ఆలయ అర్చకులు తెలిపారు. వెళ్లిన వారిలో జక్కుల రాము, రాజు, మహేష్, శివ, అభి, తిరుపతి, కరుణాకర్, సతీష్, నరేష్, నవీన్ తదితరులున్నారు.

వివాహ వేడుకల్లో ఆర్మూర్ ఎమ్మెల్యే


వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ వెంకటేశ్వర గార్డెన్‌లో పిప్రి మాజీ సొసైటీ చైర్మన్, మాజీ సర్పంచ్ జీవన్‌రెడ్డి కుమారుడి వివాహ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించగా.. ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, నియోజకవర్గ నాయకులు శ్రీ కంచెట్టి గంగాధర్, మాజీ మున్సిపల్ చైర్మన్, మాజీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పాలేపు రాజు, ఆరే రాజేశ్వర్, మందుల పోశెట్టి, చేగంటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు


వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్ర శివారులోని బ్రహ్మంగారి గుట్ట వద్ద 63వ నంబర్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్ పోస్ట్ వద్ద ఆదివారం ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్ వాహన తనిఖీలు నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా సరిహద్దు మండలమైన కమ్మర్‌పల్లి శివారులో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్ పోస్ట్ వద్ద చెక్ పోస్ట్ సిబ్బందితో కలిసి ఆయన వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులతో మాట్లాడి వాహనానికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనదారులు రూ.50వేలకు మించి నగదును వెంట ఉంచుకోవద్దని, అంతకంటే ఎక్కువ నగదు ఉంటే అందుకు సంబంధించిన పత్రాలను వెంట తెచ్చుకోవాలని ఈ సందర్భంగా ఆయన వాహన యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చెక్‌పోస్ట్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వేలాడిన విద్యుత్ తీగలు

- సరిచేసిన సిబ్బంది

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రం నుంచి సింగంపల్లి గ్రామానికి వెళ్ళే దారిలో విద్యుత్ తీగలు రోడ్డుపై కిందికి వేలాడు తున్నాయి. స్థానిక రైతులు గమనించి విద్యుత్ అధికారులకు ఫోన్ చేయగానే వారు వచ్చి రోడ్డుపై కిందికి వేలాడుతున్న తీగలను తొలగించారు.


రోడ్డుపైన వేలాడుతున్న విద్యుత్ తీగలు

సైబర్ నేరాలతో విలవిల

- ప్రాణాలమీదకొస్తున్న వైనం
- ఇటీవలే సైబర్ వలలో చిక్కి.. ఆత్మహత్య చేసుకున్న ఓ యువకుడు
- అప్రమత్తంగా ఉంటేనే మేలంటున్న అధికారులు

నవతెలంగాణ-ఆర్మూర్

మాటలే పెట్టుబడిగా.. సెల్‌ఫోన్‌లే ఆయుధాలుగా అమాయకపు వ్యక్తులను ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు డబ్బులు కొల్లగొడుతున్నారు. సైబర్ వలలో చిక్కి సామాన్యులు విలవిలలాడుతున్నారు. ఉమ్మడి జిల్లాల్లో నిత్యం సైబర్ మోసాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. కేసుల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది.

సైబర్ నేరాల కట్టడికి ఉమ్మడి జిల్లాలలోని ప్రతి పోలీస్ స్టేషన్లో సైబర్ వారియర్లను నియమించారు. వీరు షీటీం బృందాలు, కళాబృందాలు, ప్రతినిధులు నిత్యం సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నా.. ఎక్కడో ఒకచోట మో సాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల మండలంలోని మగ్గిడి గ్రామంలో ఒక విద్యార్థి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.



ఎలా జరుగుతున్నాయంటే..

బీమా సంస్థల పేరిట, నకిలీ కస్టమర్ కేర్లుగా మాట్లాడడం, అపరిచితులకు యూపీఐ, ఓటిపి నంబర్లు చెప్పడం, ఉద్యోగాలు కల్పిస్తామని, కేవైసీ అప్‌డేషన్ అంటూ మోసాలు, బీమాలు, లాటరీలు బహుమతుల పేరిట నమిస్తున్నారు. అంతర్జాల రుణయాప్‌లు, క్యూఆర్ కోడ్ స్కానింగ్, సామాజిక మధ్యమాలలో నకిలీ ప్రొఫైల్స్ సృష్టించటం, ఏటీఎం క్రెడిట్ కార్డుల ద్వారా సివివి, ఎక్స్పైరీ డేట్, డిజిటల్ నంబర్ల పేరుతో నమ్మించడం, పెండ్లి సంబంధాల కోసం నకిలీ వెబ్‌సైట్‌లోకి వెళ్తూ ఫోటోలు మార్ఫింగ్ చేయడం, వీడియో కాల్స్‌తో నగ్న సంభాషణలతో బ్లాక్ మెయిల్ చేస్తూ సైబర్ నేరస్తులు ఎందరినో వేధిస్తూ అధిక మొత్తాలను కాజేస్తున్నారు.

గతంలో కొన్ని ఘటనలు..

కామారెడ్డి జిల్లాలోని రామారెడ్డికి చెందిన యాగాల నాగరాజుకు ఓ గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. 'మీరు ఎల్ఐసి పాలసీ చేశారు కదా. బోనస్ డబ్బులు రూ.19000 వచ్చాయి. మీరు చేయాల్సిందల్లా మీ ఫోన్ నెంబర్‌కు పంపుతున్న కోడ్‌కు ఫోన్‌పేలో ఎంటర్ చేయడమే. వెంటనే ఎల్ఐసి బోనస్ డబ్బులు మీకు సంబంధించిన ఖాతాల్లో జమవుతాయి' అని ఫోన్‌లో మాట్లాడారు. నమ్మిన ఆయన ఫోన్ పే ఓపెన్ చేసి వచ్చిన కోడ్‌ను ఎంటర్ చేశాడు. వెంటనే ఆయన ఫోన్ పే నుంచి 4 విడతలలో 98,250 వెళ్లిపోయాయి. మోసపోయినట్టు గ్రహించిన అతను పోలీసులను ఆశ్రయించాడు. ఇదే జిల్లా కేంద్రంలోని గత సంవత్సరం సూమయ్య పీర్దోస్‌కు పార్ట్ టైం జాబ్ ఉందంటూ టెలిగ్రామ్‌లో కాల్ వచ్చింది. గుర్తుతెలియని వ్యక్తులు చెప్పినట్లుగా యూట్యూబ్లోకి వెళ్లి లైక్ చేసి సబ్స్క్రైబ్ చేశారు. సంబంధిత స్క్రీన్‌షాట్‌ను ఆమె సదరు వ్యక్తులకు పంపించారు. వెంటనే ఆమె ఖాతాలోకి ఒక 150 జమ చేశారు. ఇలా మూడుసార్లు జమయ్యాయి.

మళ్లీ ఆమె 3000 పంపించగా ప్రతిగా 5000 తిరిగి పంపించారు. ఆమె పూర్తిగా నమ్మిందని గ్రహించిన సైబర్ నేరస్తులు ఆమెను అనేకమార్లు డబ్బులు పంపించాలని చెప్పగా.. అలానే పంపించారు. చివరకు ఆమె పంపిన డబ్బులు తిరిగి తీసుకోవడానికి వీలులేకుండా పోవడంతో తాను మోసపోయానని గ్రహించింది. బాధితురాలు సైబర్ మోసగాళ్లకు సమర్పించుకున్న రూ.1,30,000 తిరిగి ఇప్పించాలని పోలీసులకు మొరపెట్టుకుంది.

ఇలా చేయండి..

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి మోసపోయిన బాధితులు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలి. cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చు. 24గంటల్లోపు ఫిర్యాదు చేసినవారికి పోగొట్టుకున్న సొమ్మును తిరిగి రాబట్టుకునే అవకాశాలు ఉటాయని పోలీసులు చెబుతున్నారు.

ఇలా కట్టడి చేయవచ్చు..

కఠినమైన పాస్వర్డ్‌లను పెట్టుకోవడం, తరచూ మార్చుకోవడం, ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్‌లలో ప్రొఫైల్ లాక్ చేసుకోవాలి. సామాజిక మధ్యమాల్లో కుటుంబ సమేత ఫోటోలు ప్రొఫైల్‌గా పెట్టుకోవద్దు. అపరిచితుల నుంచి వచ్చే లింకులు, మెసేజ్‌లను తెరిచి చూడవద్దు. గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం చెప్పవద్దు. సామాజిక మధ్యమాల్లో ఎవరైనా డబ్బులు పంపామని కోరితే సంబంధిత వ్యక్తితో మాట్లాడి నిర్ధారించుకోవాలి. కస్టమర్ కేర్ నంబర్‌ను సంబంధిత అధికారిక వెబ్‌సైట్‌లోనే తీసుకోవాలి.

చదువుతో పాటు సమాజాన్ని చదవాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థులు చదువుతో పాటు సమాజాన్ని చదవాలని, అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని మోడల్ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థులకు పరీక్షల పట్ల అవగాహన వస్తుందని, అదే విధంగా ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయని సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 6 సెంటర్‌లో 800ల మంది విద్యార్థులకు నిర్వహించిన మోడల్ ఎప్‌సెట్ నీట్ పరీక్ష పత్రాన్ని ఆదివారం సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్ పరీక్షలో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడల్ ఎంసెట్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే పరీక్షలు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు విద్యార్థులకు సమయం వృథా కాకుండా పరీక్ష ఎలా రాయాలా అనేది కూడా చాలా ఉపయోగమని వీటన్నిటికైనా ఒక అవగాహన కల్పించేందుకు ఏఐఎస్ఎఫ్ ఏర్పాటు చేసిన మోడల్ ఎంసెట్ ఎంతో ఉపయోగమని, అందుకు ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకత్వాన్ని అభినందించారు. కార్యక్రమంలో నారాయణ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి అంజలి, రఘురాం, ఏఐవైఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రంజిత్, ఏఐఎస్ఎఫ్ ఆర్మూర్ మండల అధ్యక్షుడు షెక్ చోటు, నాయకులు నవీన్, శివాజీ, నిత్యశ్రీ, నరేష్, కోటేశ్వర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



మోడల్ పేపర్ ఎప్‌సెట్, నీట్ పరీక్ష పత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు

నేడు జిల్లా కేంద్రానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక

నవతెలంగాణ-ఆర్మూర్/మోపాల్

పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి టీ జీవన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు జిల్లా కేంద్రానికి వస్తున్నట్లు నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలతో పాటు అన్ని నియోజకవర్గాల్లోని నాయకులు పాల్గొనాలని కోరారు.

మోపాల్ : సోమవారం ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి నామినేషన్ వేస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా నామినేషన్ అనంతరం పాత కలెక్టరేట్ మైదానంలో బహిరంగ సభ ఉంటుందని, మోపాల్ మండలం నుంచి ప్రతి కాంగ్రెస్ కార్యకర్తలు తరలిరావాలని మండలాధ్యక్షుడు సాయిరెడ్డి తెలిపారు.

ప్రశాంతంగా టిఎస్ఆర్జేసీ సెట్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

టిఎస్ఆర్జేసీ (తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల) సెట్ - 2024 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 గంటల నుంచి 12:30 నిమిషాల వరకు నిజామాబాద్ జిల్లాలో 32 పరీక్ష కేంద్రాలలో 7607 మంది విద్యార్థులకు గాను 1060 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా 6547 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు టిఎస్ఆర్జేసీ జిల్లా కోఆర్డినేటర్ తెలిపారు. కాగా పరీక్ష ప్రశాంతంగా కొనసాగిందని ఆయన పేర్కొన్నారు.

శ్రీ భాషిత పాఠశాలలో కిండర్ గార్డెన్స్ గ్రాడ్యుయేషన్ డే

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీభాషిత పాఠశాలలో శనివారం సాయంత్రం నటరాజ ఫంక్షన్ హాల్‌లో పిపి 3 విద్యార్థులకు కిండర్ గార్డెన్స్ గ్రాడ్యుయేషన్ డేను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ భాను రామగిరి (లైఫ్ హాస్పిటల్) ఐఎంఏ డాక్టర్ యు.రాకేష్ కుమార్ (బాలరాజ్ మెమోరియల్ హాస్పిటల్) పాల్గొన్నారు. ఈ వేడుకలలో పిపి1, 2, 3 విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాను రామ్ గిరి మాట్లాడుతూ.. చిన్న పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం అభినందనీయమన్నారు. డాక్టర్ రాకేష్ కుమార్ మాట్లాడుతూ పిల్లలు ఇంత చిన్న వయసులోనే జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన విషయాలు నేర్చుకోవడం చాలా అద్భుతంగా ఉందని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ మాట్లాడుతూ పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే మంచి ఉల్లాసాన్ని అందించడానికి ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఇందుకు సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులకు అభినందన

ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కుక్కల గుట్టలో పెర్కిట్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి మందిర పునప్రారంభ నిర్మాణంలో భాగంగా భూమి పూజ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అయ్యప్ప శ్రీనివాస్, పెర్కిట్ సొసైటీ డైరెక్టర్లు మానేటి లింబాద్రి, మూడ అశోక్, పట్టణ కౌన్సిలర్లు కొంతం మురళి, రింగుల భూషణ్, మామిడిపల్లి మాజీ సర్పంచ్ మారుతిరెడ్డి, విడిసి అధ్యక్షులు సాహెబ్‌గారి దేవేందర్, కోశాధికారి రాజుబాబు, దేగ్లూర్ గంగాధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శేఖర్‌రెడ్డి, బుజ్జి రెడ్డి, చిట్టి రెడ్డి మల్కన్న, దాసరి అనిల్, నటరాజ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హస్తం గూటికి భారీగా చేరికలు..

పట్టణానికి చెందిన భారత్ గ్యాస్ సుమన్, కొడిగెల మల్లయ్య, దున్నాల రామాగౌడ్, బీఆర్ఎస్ యువ నాయకులు సాయితేజ, సాయిరాజ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మామిడిపల్లి మాజీ సర్పంచ్ మారుతిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ మానేటి లింబాద్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోచన్న, కౌన్సిలర్ రింగుల భూషణ్, సీనియర్ నాయకులు దాసరి అనిల్, శేఖర్‌రెడ్డి, మల్కన్న, బుజ్జి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

42వారం స్వచ్ఛ కాలనీ కార్యక్రమం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రెండు గంటలు అనే నినాదంతో నిర్వహిస్తున్న స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం 42వ వారం ఉత్సాహంగా నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఈ ఆదివారం కాలనీలోని భక్త హనుమాన్ ఆలయ ప్రాంగణ పరిసరాల్లో శ్రమదానం చేశారు. ఆలయానికి నలువైపులా, సామాజిక భవనం ముందర, పక్కన రోడ్లను, పరిసరాలను శుభ్రం చేశారు. చీపుర్లతో చెత్తను ఊడ్చారు. పారలతో చెత్తను గమేలాలలో ఎత్తి దూరంగా వేశారు. వ్యర్థాలను ఒకచోట కుప్పగా పోసి నిప్పంటించారు. కట్టర్‌తో చెట్ల కొమ్మలను కత్తిరించారు. ముళ్ళ పొదలను, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ మాట్లాడుతూ మంగళవారం హనుమాన్ జయంతి ఉన్నందున ఆలయ పరిసరాలను శుభ్రం చేశామని తెలిపారు. 42 వారాలుగా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం ఇతర కాలనీలకు స్ఫూర్తిగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధికి నిధుల మంజూరికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షులు పుప్పాల శివరాజ్ కుమార్ మాట్లాడుతూ హనుమాన్ జయంతి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయలని కోరారు. కాలనీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్ కుమార్, కాలనీ కోశాధికారి సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు సుంకే శ్రీనివాస్, కొక్కెర భూమన్న, కార్యదర్శులు కొంతం రాజు, సాయన్న, ఎర్ర భూమయ్య, ఎస్సారెస్పీ డీఈ గణేశ్, ఎల్టీ కుమార్, బొల్లు జీవన్, పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి ఘనపురం సంతోష్, కానిస్టేబుల్ ప్రసాద్, రవి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.


శ్రమదానంలో పాల్గొన్న కాలనీవాసులు

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి

అశోక్‌నగర్‌లో గల భక్త హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మీ కాలనీలో ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని వీలైనంత త్వరలో మీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. చైర్‌పర్సన్‌ను కలిసిన వారిలో భక్త హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు ఉన్నారు.



చైర్‌పర్సన్ గడ్డం ఇందు ప్రియకు సన్మానం

నేడు బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

- ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు తరలి రావాలి

నవతెలంగాణ-మద్నూర్

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జహీరాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ఈనెల 22న సోమవారం సాయంత్రం మద్నూర్, డోంగ్లి మండలాల్లో పర్యటిస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని ఆయా మండలాల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయాలని మండల నాయకులు కోరారు. గాలి అనిల్ ప్రచారానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్యానల్ మాజీ స్పీకర్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంతు షిండే, కామారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్, పాల్గొంటారని మండల నాయకులు తెలిపారు.

జోడెద్దుల్లా పని చేసి అభివృద్ధి చేస్తాం

- కారు టైర్ పంక్షర్ అయిందని పువ్వుపై కూర్చున్న 'బిజినెస్ పాటిల్'
- రోడ్‌షోలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్

నవతెలంగాణ-గాంధారి/తాడ్వాయి

కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను గెలిపిస్తే ఇద్దరం కలిసి జోడెద్దుల్లా పని చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చి ముందువరుసలో నిలుపుతామని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ అన్నారు. గాంధారి మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం రోడ్ షో నిర్వహించారు. గాంధారి మండల కేంద్రంలో భారీ ర్యాలీతో గాంధారి వీధుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ హామీలను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా సురేష్ శెట్కార్ మాట్లాడుతూ బీజేపీ ఎంపీ గా పోటీ చేసే అభ్యర్థి బీబీ పాటిల్ కాదు బిజినెస్ పాటిల్ అని, ఆయనకు బిజినెస్‌లకు తప్ప రాజకీయాలకు ఏ మాత్రం పనికి రాడని అన్నారు.

ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ గాంధారి మండలాన్ని దత్తత తీసుకుంటానని బీబీపాటిల్ మోసం చేసి అభివృద్ధి ఏం లేకుండా మళ్ళీ ఓట్లు అడగడానికి వస్తున్నాడని దుయ్యబట్టారు. కార్ టైర్ పంక్చర్ అయిందని పువ్వుపై కూర్చున్నాడన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఎమ్మెల్యే, ఎంపీ కలిసి జోడెద్దుల్లా పని చేసి నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో ఉంచుతామన్నారు. శెట్కార్ ఎంపీగా ఉన్నప్పుడు ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ఎన్నో బ్రిడ్జిలు, రోడ్లు వేశామని తెలిపారు. బీబీ పాటిల్‌ని గెలిపిస్తే బొంబాయిలో తప్ప తెలంగాణ కి రాడు, ఇందిరమ్మ రాజ్యం తీసుకరా వాలంటే కాంగ్రెస్ పార్టీ కి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





గాంధారిలో రోడ్‌షోలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, అభ్యర్థి సురేశ్ షెట్కార్.. ప్రచార ర్యాలీలో పాల్గొన్న ఇరువురు

కాంగ్రెస్‌ను ఆదరించాలి

తాడ్వాయి : తాడ్వాయి మండలం చిట్యాలలో ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కె. మదన్ మోహన్ ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎల్లారెడ్డిలో భారీ మెజార్టీ రాబోతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించటానికి కృషి చేస్తానన్నారు. తాను నియోజక అభివృద్ధికి కట్టుబడి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తా.. 50 ఓట్లు వేయించాలి

నవతెలంగాణ-సదాశివనగర్



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి కాంగ్రెస్ అభ్యర్థికి మెజార్టీ ఓట్లు తీసుకురావాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచించారు. మండలంలోని గ్రామాల అధ్యక్షులతో, యూత్ అధ్యక్షులతో రివ్యూ మీటింగ్ ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్‌రెడ్డి ఆదివారం నిర్వహించారు. ప్రతి ఒక్కరితో ముఖాముఖీగా రివ్యూ చేసిన ఎమ్మెల్యే.. ఇప్పటికి వరకు ఎన్ని ఓట్లను కాంగ్రెస్ వైపు వచ్చేలా చేసారు..? వ్యక్తి గతంగా ఎన్ని ఓట్లు వేయిస్తామని మాట తీసుకున్నారు..? ఇంటింటి ప్రచారం వంటిపై సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. మండల సమావేశాలలో చెప్పిన పనులను పూర్తి చేయని పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఎవరు అయితే పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తారో వారిని పార్టీ నుంచి బహిష్కరిస్తామన్నారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ తీసుకురావాలన్నారు. ప్రతి మండలంలో ఇలాగే రివ్యూ మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

ప్రతి ఒక్క కార్యకర్తల సుమారుగా తమ వ్యక్తి గతంగా 50 నుంచి 60 ఓట్లు తమ బాధ్యతగా తీసుకొని ఇంటింటి ప్రచారం నిర్వహించాలని సూచించారు. కాంగ్రెస్ హామీలు, రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే ద్వారానే ప్రతి పథకం అందుతుంది అనే విషయాన్ని ప్రతి ఓటరుకు తెలిసేలా చెప్పాలన్నారు. బీజేపీ వైఫల్యాలను, బీబీ పాటిల్ బిజినెస్ పాటిల్ అక్రమాలను ప్రజలకు చెప్పాలని సూచించారు. బీజేపీ టికెట్ అమ్ముకొని బీబీ పాటిల్‌కు ఇచ్చిన విషయాన్నీ ప్రజలకు తెలియచేయాలన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు



దప్పు చప్పుళ్ల మధ్య బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా ముదిరాజ్ సంఘం పెద్దమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు పున్న లక్ష్మణ్ ముదిరాజ్ సంఘము సభ్యుల ఆధ్వర్యంలో పెద్దమ్మ అమ్మ వారికి ఆదివారం మహిళలు ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం పెద్దమ్మ ఆలయం కమిటీ అధ్యక్షులు పున్న లక్ష్మన్ మాట్లాడుతూ దోమకొండ మండల కేంద్రం లోని ముదిరాజ్ సంఘము ఆధ్వర్యంలో పెద్దమ్మ ఆలయంలో వార్షికోత్సవం పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు చేసి, బోనాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పెద్ద బాలయ్య, ప్రధాన కార్యదర్శి బోయిని సత్యం, కోశాధికారి నర్సింలు, ఆలయం కమిటీ సభ్యులు గరిగే సురేష్, అబ్రబోయిన స్వామి, శ్రీనివాస్, రాములు, ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన పోచారం సురేందర్



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న నాయకులు

నవతెలంగాణ-వర్ని (మోస్రా)

మండలంలోని ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు సోదరమని కుమారుని వివాహనికి మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి ఆదివారం పెళ్లి వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలో మండల అధ్యక్షులు హనుమంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుమ లత రామ్‌రెడ్డిగౌడ్, సర్పంచ్ నరేందర్‌రెడ్డి, చింతకుంట సర్పంచ్ విమల లింగయ్య, తిమ్మాపూర్ సర్పంచ్ సున్నం భూమయ్య, బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు విందులో పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి

- నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు



నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని ఓ గ్రామంలో తన బంధువుల వద్ద ఉంటున్న బాలికపై సాలూర మండల కేంద్రానికి చెందిన యువకుడు లైంగికదాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మైనర్ బాలికతో పరిచయం పెంచుకున్న యువకుడు బాలికపై లైంగికదాడి చేయడంతో ఈ విషయం బాలిక కుటుంబీకులు గ్రహించి బోధన్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో యువకుడిపై పోలీసులు ఫోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన బాలిక గత ఆరు నెలలుగా బోధన్ మండలంలోని ఓ గ్రామంలో ఆమె బంధువుల ఇంటి వద్ద ఉంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సాలూర మండలానికి చెందిన యువకుడితో పరిచయం ఏర్పడి గత కొన్ని రోజులుగా బాలికతో పరిచయం పెంచుకుని ఈ ఘటనకు పాల్పడినట్లు సమాచారం. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం విషయం బయటపడడంతో శనివారం రాత్రి బోధన్ రూరల్ పోలీసుల వద్దకు ఈ సంఘటన విషయం చేరింది. దాంతో బాలిక బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం



ఇంటింటా ప్రచారం చేపట్టిన నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా గ్రామాలలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారగోడ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. మండలంలోని పోల్కంపేట్, కన్నాపూర్, కోమటిపల్లి, పోతాయపల్లి, లింగంపేట పట్టణంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెటర్కుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను వేడుకున్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారగోడు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందన్నారు. మహిళలకు ఉచిత బస్ ఉచిత కరెంట్ 500 కే గ్యాస్ సిలిండర్ 10 లక్షల బీమా సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారాగౌడ్, మండల యూత్ అధ్యక్షులు సుప్పాల రాజు, పోల్కంపేట తాజా మాజీ సర్పంచ్ పద్మా నాగరాజు, డాక్టర్ రాజు, వంజరి ఎల్లయ్య, దురిశెట్టి అశోక్, నగేష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కాంటాలు నిలిపివేస్తే చర్యలు

- తూకంలో పొరపాటు వస్తే కేసులు
- జిల్లా డిఎస్‌ఓ మల్లికార్జున్ బాబు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో జరుగుతున్న జాప్యంతో రైతులు అవస్థలు పడుతున్నారంటూ శనివారం బీర్కూర్‌లో రైతులు ఆందోళన చేపట్టడంతో ఆదివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా డిఎస్ఓ మల్లికార్జున్ బాబు బీర్కూర్ సహకార సంఘం కార్యాలయంలో విచారణ చేపట్టారు. కేంద్రాలను సత్వరం ప్రారంభించాలని ఈమేరకు అధికారులను ఆదేశించారు. అలాగే సిద్ధి వినాయక రైస్ మిల్లులో ధాన్యం కొలతలపై విచారణ చేపట్టారు. సహకార సంఘం వారు కొనుగోలు చేసిన ధాన్యం సిద్ధి వినాయక రైస్ మిల్లులో ధాన్యం తరుగు వస్తుందని రైతులు తహసిల్దార్ కు ఫిర్యాదు చేశారు. దీంతో



విచారణ చేపట్టిన డీఎస్‌వో

జిల్లా పౌరసరఫరాధికారి, కొలతల అధికారి సిద్ధి వినాయక రైస్ మిల్లులో విచారణ చేపట్టారు. బరంగెడ్గి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. గోనెసంచులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. తేమ శాతం 17 శాతం కంటే తక్కువగా ఉంటే పొలాలకు వెళ్లి అక్కడే అన్నదాతలకు టోకెన్లు జారీ చేయాలని వ్యవసాయ విస్తరణాధి కారులను ఆదేశించారు.

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు మించి వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. అలాగే ధాన్యం కొలతల్లో పొరపాటు జరుగుతే సహించేది లేదని డీఎస్ఓ అధికారి మల్లికార్జున్ బాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి నిత్యానంద్ డిటి ఇన్ఫోర్స్మెంట్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో ముందంజలో ఉన్నాం

- రెంజల్ సొసైటీ చైర్మన్, సెక్రెటరీ



తూకం వేసిన ధాన్యం రైస్‌మిల్లుకు తరలింపు

నవతెంగాణ-రెంజల్

ఆరుగాలం కష్టించి పండించిన రైతుల వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించడంలో మండల కేంద్రమైన రెంజల్ సింగిల్ విండో ద్వారా అధిక సంఖ్యలో ధాన్యం సేకరించినట్లు సింగిల్ విండో చైర్మన్ మొహినుద్దీన్, సీఈవో వై.రాములు ఆదివారం తెలిపారు. ఇటీవల ప్రైవేటు వ్యాపారస్తులు 22 వేలకు కొనుగోలు చేయడంతో రైతులు ఆసక్తి చూపారని, దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇవ్వడానికి నిరాశక్తత చూపడంతో బీహార్ నుంచి తీసుకువచ్చిన హమాలీలకు రోజుకు రూ.2000ల చొప్పున ఇవ్వాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు.

గత వారం రోజుల నుంచి అకాల వర్షాలు కురుస్తుండడంతో వ్యాపారులు ధాన్యం కొనుగోలుకు వెనుకంజ వేయడంతో ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కేంద్రాలనే ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటివరకు రెంజల్ సింగిల్ విండో ద్వారా సుమారు 50 వేల బస్తాలను సేకరించగా, దూపల్లిసొసైటీ 30,300, నీలా సొసైటీ 9000, ఆగ్రోస్ ద్వారా 19.296 బస్తాలు సేకరించినట్లు తెలిపారు.

ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు నత్తనడకగా కొనుగోలు జరిగాయి. కొన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభానికి పరిమితమయ్యాయి. మరో రెండు మూడు రోజుల్లో రైతులు పండించిన ధాన్యం పూర్తి అవుతుందని వారు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మద్దికుంట మాజీ సర్పంచ్



నవతెలంగాణ-రామారెడ్డి

మండలం లోని మద్దికుంట మాజీ సర్పంచ్ తోట గంగయ్య, బిఆర్ఎస్‌కు రాజీనామా చేసి, రెడ్డి పేటలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కర్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకొని కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కైలా శ్రీనివాస్, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, మండల ఇన్చార్జ్ అధ్యక్షులు మద్దికుంట నర్సా గౌడ్, బండి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రూ.17.07 లక్షల నగదు పట్టివేత

నవతెలంగాణ-మోర్తాడ్



జాతీయ రహదారి 63 పై పోలీసులు వాహనాలు తనిఖీల సమయంలో బైక్‌పై తరలిస్తుండగా 17 లక్షల 7వేల రూపాయలు నగదును పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు. పార్లమెంట్ ఎలక్షన్ లో భాగంగా రూ.50 వేలకుపైగా తరలిస్తున్న వాటికి ధ్రువపత్రాలు లేకుండా తరలిస్తే పట్టుకుంటున్నట్టు తెలిపారు. ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేయగా బ్యాగులో నగదు ఉన్నట్టు తెలిపారు. డబ్బులకు సంబంధించిన వాటికి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు చూపకపోవడంతో నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తరలిస్తే వాటికి సంబంధించిన సరైన పత్రాలు చూపించాల్సి ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-కామారెడ్డి



ఢీకొన్న బైక్, ఆటో

కామారెడ్డి మండలం లింగాపూర్ గ్రామ శివార్ లో ఉదయం సుమారు ఏడున్నర ప్రాంతంలో ఆటో బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికీ తీవ్ర గాయాలు అయినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లింగంపేట మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన దాసారం రాములు అతని తమ్ముడు లక్ష్మణు ప్రతిరోజు కామారెడ్డికి వచ్చి కూలి పని చేసుకునే వారు. ఇదే క్రమంలో ఆదివారం బైక్‌పై కామారెడ్డికి వస్తున్న క్రమంలో ఉదయం సుమారు 7 గంటల 30 నిమిషాలకు కామారెడ్డి మండలం లింగాపూర్ గ్రామ శివారులోకి రాగానే రోడ్డుపై ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన ఆటో ఢీకొంది. ఆటో పల్టీలు కొట్టగా.. తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన తమ్మల రాజు (40)తో పాటు ఇద్దరు అన్నదమ్ములకు గాయాలు అయ్యాయి. దీంతో హుటాహుటిన కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాజు మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామానికి చెందిన సందీప్ తన ఫోన్‌ను పోగొట్టుకోగా, ఈసీఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి బాధితుడికి తిరిగి అప్పగించినట్లు ఎస్సై ఈ.సాయన్న, ఈసీఐఆర్ ఆపరేటర్ గణేష్‌లు తెలిపారు. తన ఫోన్‌ను తిరిగి రావడానికి సహకరించిన స్థానిక పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఎవరైనా ఫోన్‌ను పోగొట్టుకుంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని వారు పేర్కొన్నారు.

గురుకులానికి ముగ్గురు విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని దర్మారావుపేట్ ప్రాథమిక పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు గురుకులానికి ఎంపికైనట్లు ప్రదానోపా ధ్యాయుడు సదాశివ్ ఆదివారం తెలిపారు. రిషిత, అబిజ్ఞ, మణివీత్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గురు విద్యార్థులను ప్రదానోపాధ్యాయుడు సదాశివ్, ఉపాధ్యాయులు మోహన్‌రావు, బాల్ చంద్రం, మధుక్రిష్ణ, తదితరులు విద్యార్థులను అభినందించి నట్లు తెలిపారు.

నవతెలంగాణ
నిజామాబాద్
సోమవారం | ఏప్రిల్ 22, 2024 | www.navatelangana.com

డీఎస్‌పీ ఎంపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- మండలాధ్యక్షులు రమేష్ మహారాజ్

నవతెలంగాణ-మాక్లూర్

డీఎస్‌పీ ఎంపీ అభ్యర్థి నామినేషన్ కారక్రమాన్ని విజయవంతం చేయాలని మండలాధ్యక్షులు రమేష్ మహారాజ్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్‌పీ మండల అధ్యక్షులు రమేష్ మహారాజ్ మాట్లాడారు. నిజామాబాద్ ఎంపీ ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి కండెల సుమన్ మహారాజ్ నామినేషన్ ఏప్రిల్ 23న మంగళవారం ఉదయం 10 గంటలకు ఉంటుందని, కనుక ఈ సందర్భంగా నిజామాబాద్‌లో ధర్మసామాజ్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని మాక్లూర్ మండల ధర్మసమాజ్ పార్టీ కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు

నవతెలంగాణ-ముప్కాల్

సోమవారం నుంచి ఈ నెల 24వ బుధవారం వరకు మూడు రోజుల పాటు 'శ్రీ మల్లన్న విగ్రహ ప్రతిష్ట' మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు 'వేంపల్లి యాదవ సంఘం' పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 బుధవారం మల్లన్న 'విగ్రహ ప్రతిష్ట'తో పాటు 'ధ్వజ స్తంభ ప్రతిష్ట' ఉత్సవాలు ఘనంగా చేపట్టనున్నట్టు వివరించారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని, అందుకు మండలంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. మల్లన్న విగ్రహ ప్రతిష్టాపన రోజు భక్తుల సౌకర్యార్థం మహాన్నదాన సత్రం సైతం నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘ పెద్దలు పేర్కొన్నారు.

కబ్జా కోరల్లో రఫల్‌కుంట

- పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

నవతెలంగాణ-భీంగల్

చెరువుల పరిరక్షణపై అధికారుల నిఘా కొరవడిందని చెప్పవచ్చు. చెరువుల పరిరక్షణకు పాటుపడుతున్నామని చెప్పుకునే ప్రభుత్వాలు ఆ దిశగా అధికారులను అప్రమత్తం చేయలేకపోతుంది. అధికారుల పర్యవేక్షణ కరువవడంతో కొందరు అందిన కాడికి కబ్జాకు పాల్పడుతూనే ఉన్నారు. ప్రతి సంవత్సరం అనువైనంత కబ్జాకు పాల్పడుతూ వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారు. కుంట కబ్జాకు గురవుతున్నట్టు ఆయకట్టు రైతులు పలుమార్లు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఏ ఒక్క అధికారీ పట్టించుకోకపోవడం గమనార్హం.

భీంగల్ పట్టణ కేంద్రం నుంచి బెజ్జోరకు వెళ్లే రోడ్డులో గల రఫల్‌కుంట (రామన్నకుంట) శిఖం రెవెన్యూ రికార్డులలో 1256 సర్వే నెంబర్‌లో సుమారు 19 ఎకరాలు ఉంది. ప్రస్తుతం ఈ చెరువు 10 ఎకరాలు కూడా లేదు. ఈ చెరువు ద్వారా సుమారు 20 ఎకరాలకుపైన చిన్న సన్నకారు రైతులు ఆధారపడి వర్షకాలం పంట పండించి జీవనం సాగిస్తున్నారు. కానీ ఈ కుంటపై కొందరు కబ్జారాయుళ్ల కన్ను పడింది. వారికి వీలైన కాడికి ప్రతి సంవత్సరం కొంత భూమిని కబ్జా చేస్తూ తమ భూమిలో కలుపుకుంటున్నారు.



కబ్జాకు గురవుతున్న రఫల్‌కుంట భూమి

ఈ చెరువును పట్టించుకునే నాథుడే లేడు..

గతంలో వర్షాలతో నిండిన చెరువును రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే కాందార్లు ఆయకట్టు రైతుల పంట పొలాలకు నీటిని విడుదల చేసేవారు. కానీ కాలక్రమేనా గడిచిన కొన్ని రోజుల నుంచి రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో వర్షాకాలం పూర్తి నీటితో నిండిన ఈ చెరువును కొందరు దురుద్దేశంతో రాత్రికి రాత్రే తూమును లేపేయడంతో నీరంతా పంట పొలాల నుంచి ప్రవహించడంతో పంట పొలాలు నాశనమయ్యాయి. దీంతో చెరువు నీరంతా ఖాళీ అవుతుంది. పంట చివరి దశలో అవసరమయ్యే నీరు కూడా అందడం లేదు. ఈ విషయమై గతంలో ఆయకట్టు రైతులు ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరు పట్టించుకోలేదు.

రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ గోడప్రతుల ఆవిష్కరణ



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం సభ్యులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని నయాబాది ప్రాంతంలో రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిలంచారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 30 వరకు జోగు ఎత్తుట నుంచి కల్యాణ వరకు వివిధ కార్యక్రమాలు ఉన్నాయని గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎల్లాగౌడ్, నటరాజ్ గౌడ్, పుట్ట నర్సాగౌడ్, మల్లా గౌడ్, రవి గౌడ్, అశోక్ గౌడ్, రవి గౌడ్, ప్రహ్లాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని బెజ్జోర గ్రామంలో లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్‌లో భీమ్‌గల్ పట్టణానికి చెందిన కర్నే రాజేశ్వర్ కూతురు వివాహ వేడుకలకు హాజరై ఆదివారం నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ మధు శేఖర్, బి.ఆర్.ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దొనకంటి నర్సయ్య, మున్సిపల్ చైర్మన్ కన్నే సురేందర్ ప్రేమలత, నాయకులు కర్నే సత్య గంగయ్య, వార్డ్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ మండలాల నాయకులు, మైనార్టీ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యూత్ యువకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువల పరిరక్షణకు కవులు, కళాకారులు కదలాలి

రాష్ట్రస్థాయి కవి గాయక సమ్మేళనంలో ఘనపురం దేవేందర్

నవతెలంగాణ-నిజామాబాద్

హైదరాబాద్ పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన భవన్లో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి కవి గాయక సమ్మేళనంలో నిజామాబాద్‌కు చెందిన ఘనపురం దేవేందర్ పాల్గొని పోలి కేక అనే కవితను వినిపించారు. సమూహ సంస్థ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ కవి సమ్మేళనంలో పాల్గొని దేశంలో రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ప్రజలను కార్యోన్ముఖులను చేయాల్సిన బాధ్యత కవులు, కళాకారులపై ఉందన్నారు. దాసోజు లలిత అధ్యక్షత వహించిన ఈ కవి సమ్మేళనంలో డాక్టర్ కోయి కోటేశ్వరరావు, భరత్, ఇస్తారి, కస్తూరి ప్రభాకర్, హథీరామ్ సభావట్, తదితరులు కవిత గానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కాత్యాయని విద్మహే, డాక్టర్ నాళేశ్వరం శంకరం, డాక్టర్ చమన్ సింగ్, యాకూబ్, డాక్టర్ బెల్లం కొండ సంపత్కుమార్, కందుకూరి శ్రీరాములు, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు, యువకులు, ప్రముఖులు, పుర ప్రముఖులు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జి.సాయికుమార్, ఉపాధ్యక్షులు బేగారి భూషణ్, పురుషోత్తం గౌడ్, కోశాధికారి ఎం.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కుడుకల రాజు, కార్యదర్శి శ్రావణ్ కుమార్, సంయుక్త కార్యదర్శి బేగరి మనోహర్, సలహాదారులుగా మాసం రాజేశ్వర్, ఊరడి సందీప్, సలహాదారులుగా అజయ్‌గౌడ్, దర్గల నరేష్, హేమంత్, సభ్యులుగా కల్లెడ ప్రసాద్, కుమ్మరి శేఖర్, రాచర్ల రాములును ఎన్నుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, 2002-2003వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి విద్య బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులందరూ ఒకే వేదికపై కలుసుకొని ఆప్యాయంగా పలకరించుకుని ఒకరినొకరు యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను ఆత్మీయ పలకరింపులు, నాటి మధుర స్మృతులను తలుచుకొని ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులందరూ ఒకేచోట చేరడంతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. క్రమశిక్షణ చిన్నతనం నుంచే అలవాటు చేసుకోవాలని, ఈనాడు సర్వత్రా క్రమశిక్షణ లోపించడం వలన యూత్ చెడు తోవ పడుతున్నదని పేర్కొన్నారు. ఎండ ఎదిగినా.. ఊరిని, తల్లిదండ్రులను ఏనాడూ మరువద్దని అన్నారు. అలాగే శరీరానికి వ్యాయామం ఎంతో అవసరమన్నారు. తద్వారా అందరూ వ్యాయామం చేయాలని సూచించారు. కుంటుంబంలో పిల్లల బాధ్యత తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులదేనని వివరించారు. విద్యార్థులు ఈ ఫ్రెండ్లీ రిలేషన్ షిప్ ఇలాగే కొనసాగించుకోవాలని, కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా ఇలాగే కొనసాగాలని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థినిరాలు రజిత మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తర్వాత గురువులే దైవ సమానులుగా భావించకుంటామని, గురువుల వల్లనే ఈ క్రమశిక్షణ నేర్చుకునే అవకాశం కల్గిందన్నారు. 21ఏండ్ల తర్వాత నాతోటి మిత్రులందరినీ కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డిచ్‌పల్లి ప్రధానోపాధ్యాయులు సీతయ్య, ఉపాధ్యాయులు, అవదేశ్, ధృపతి కుమార్, వెంకటేశ్వర్, నారాయణ, షేక్ హైదర్, విజయలక్ష్మి, దామోదర్, హరిచరణ్, జలంధర్ పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రాలుతున్న గులాబీ, కమలం రేకులు

- కాంగ్రెస్ పార్టీలో చేరిన 150 మంది ఇతర పార్టీ నాయకులు
- కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి సునీల్ కుమార్



కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని బాల్కొండ, బోదేపల్లి గ్రామాలకు చెందిన సుమారు 150 మంది బిఆర్ఎస్, బిజెపి పార్టీ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బూత్ కన్వీనర్ గుండేటి మోహన్‌రెడ్డి బాల్కొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బోదేపల్లి గ్రామానికి చెందిన నాయకులు మాజీ ఉప సర్పంచ్ మీసాల రాజు, బీఆర్ఎస్ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు నార్ల రాజు, మోర్తాడ్ గంగన్న, హనుమాన్ దాస్, మామిడి శంకర్, రాజేందర్, జక్క రాకేష్, నీరటి శ్రీనివాస్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. అలాగే బాల్కొండ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ తౌట్ గంగాధర్, మాజీ సర్పంచ్ కాల శ్రీనివాస్, నల్లూరి హరికృష్ణ, పిట్ల దయాకర్, కుమ్మరి గంగాధర్, మెడికల్ సత్యనారాయణ గౌడ్, ఆర్కరి కిసాన్, తౌట్ అరవింద్, సంతోష్ కుమార్, సయ్యద్ ఇంత్యజ్, సళ్ళహుద్దీన్ ఇమ్రాన్, తేజ, సజ్జద్, శ్యామ్, నసీం ఉద్దీన్, ఆవేశ్, అమెర్, ఆషు, ఇమ్రాన్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా వీరందరికీ కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజారిటీ వచ్చే విధంగా సమన్వయంతో పనిచేయాలని, ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సునీల్ కుమార్ కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజామాబాద్ జన జాతరకు కాంగ్రెస్ నాయకులు తరలిరావాలి

యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వినోద్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/డిచ్‌పల్లి

నిజామాబాద్ జన జాతరకు కాంగ్రెస్ నాయకులు తరలి రావాలని యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వినోద్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి నామినేషన్ వేస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, గ్రామస్థాయి నాయకులకు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

డిచ్‌పల్లి : నిజామాబాద్‌లో సోమవారం జరగబోయే జనజాతర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నారని, ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభిమానులు కార్యకర్తలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఇందల్‌వాయి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి నామినేషన్ వేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కార్యోన్ముఖులై మీ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రైతు చుట్టూ రాజకీయం

పార్లమెంట్ ఎన్నికల వేళ.. ఓట్ల కోసం అభ్యర్థుల పాట్లు

- స్పీచుల్లో రైతులపై ఎనలేని ప్రేమ చూపుతున్న అభ్యర్థులు
- జోరుగా సభలు, సమావేశాలు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. ఆయా పార్టీల అభ్యర్థులు ఓట్ల కోసం పాట్లు పడుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు జోరుగా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఒకరిపై మరొకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. ప్రధానంగా ప్రచార సభల్లో రైతులపై ఎనలేని ప్రేమను చూపుతున్నారు. కానీ రైతుల సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు వరితో పాటు వివిధ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇటువంటి అనుకొని ఘటనలు జరిగిన సమయంలో రైతుల ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోని రాజకీయ నాయకులు మాత్రం.. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల వేళ.. తమ రాజకీయ చతురతను ప్రదర్శిస్తూనే ఉన్నారు. రైతుల మీద ఎంతో ప్రేమ ఉన్నట్టు.. ప్రధాన పార్టీలు పసుపు బోర్డు తెచ్చామని ఒకరు.. పసుపు బోర్డుకు స్థలం ఎక్కడ కేటాయించారని మరొకరు.. అసలు పసుపు పంటకు మద్దతు ధర ఎక్కడా అని ఇంకొకరు.. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ రైతులను అయోమయానికి గురిచేస్తున్నారు.



అంతేకాకుండా మరోవైపు నిజామాబాద్ జిల్లాలో పేరుగాంచిన ఆసియా ఖండంలోని రెండవ స్థానంలో ఉన్నటువంటి చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని, అది తమతోనే సాధ్యమంటూ ప్రధాన పార్టీల రాజకీయ నాయకులు రాజకీయం చేస్తూనే ఉన్నారు. కానీ ఈ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించడంలో గానీ, పసుపు బోర్డు తేవడంలో గానీ ఆయా పార్టీలు గట్టిగా ప్రయత్నించడం లేదని ప్రజల ఆరోపణలు.

ఇటీవల కురిసిన అకాల వర్షంతో పాటు భారీ ఈదురుగాలులకు నిజామాబాద్ జిల్లాలోని మాక్లూర్, ఆర్మూర్, నందిపేట్, మోపాల్, రెంజల్, నవీపేట్, ఇందల్వాయి, ధర్పల్లి, డిచ్‌పల్లి, నిజామాబాద్ రూరల్ మండలాల్లోని 29 గ్రామాలలో 1071 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. అంతేకాకుండా కోత కోసి ఆరబో సిన ధాన్యం సైతం రైతులు నష్టపోయారు. పై లెక్కలు కేవలం ప్రాథమికంగా అంచనా వేసినవే. అధికారులు ఇంకా పూర్తిస్థాయిలో పంట నష్టం లెక్క తేల్చలేదు. ఇదిలా ఉండగా.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమైనా.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వమైనా పంట నష్టపోయిన రైతులను ఆదుకోకుండా, వారికి భరోసా ఇవ్వకుండా రైతులపై మాత్రం కపట ప్రేమను చూపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.